క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/రఘునాథపాలెం: రహదారి వెడల్పు పనుల కారణంగా రఘునాథపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ సంజీవకుమార్, ఏఈ ఇందర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోయ చెలక, రఘునాథపాలెం ఇండస్ట్రియల్ ఫీడర్ ఆధారంగా ఉన్న వినియోగదారులు విద్యుత్ అంతరాయం పట్ల సహకరించాలని కోరారు. దీంతో రఘునాథపాలెం ప్రాంతం, కేసీఆర్ కాలనీ, కేటీఆర్ కాలనీ, కోయచెలక, రేగులచెలక, ప్రగతిప్రైడ్, రఘునాథపాలెం పై కాలనీ, దారేడు, శివాయిగూడెం, పువ్వాడ ఉదయ్ నగర్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పండ్లు పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ నూర్ భాషా, దూదేకుల, ముస్లీం మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జనాబ్ షేక్ ఫకీర్‌సాహెబ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా ఆశ్రమంలో సోమవారం అనాథలకు పండ్లు పంపిణీ చేసి వృద్ధులకు అన్నదానం చేశారు. సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషా ఫకీర్‌సాహెబ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోందు, డాక్టర్ రహీం, మహిళా అధ్యక్షురాలు సభినాబీ, రహీం పాషా, సిద్దుబాష, మొగలా, సైదులు, నగర అధ్యక్షుడు షేక్ రసూల్, ఆర్.సైదులు, మౌలానా పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

ఖమ్మంరూరల్: రోజుకు రోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో సామాన్యుడు బతకలేని పరిస్థితి నెలకొందని, తక్షణమే పెంచిన ధరలను ప్రభుత్వం అదుపు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు పి. సంగయ్య తెలిపారు. సోమవారం మండలంలోని మద్దులపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోగా తిరిగి మేనిఫెస్టోల పేరుతో మరోసారి ప్రజలను మోసగించేందుకు పాలకులు కుయుక్తులు పన్నుతున్నారు. ఈ సమావేశంలో నాయకులు వి.నాగేశ్వరరావు, కె. గురవయ్య, ఉపేందర్, పగిడిపల్లి వెంకట్రావు, ఎర్రా నర్సింహారావు, భూక్యా శ్రీను, రామయ్య పాల్గొన్నారు.

న్యాయవాది మృతిపై సంతాపం


నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన న్యాయవాది మంద జ్యోతి అనారోగ్యం బారిన పడడంతో చికిత్స చేయిస్తుండగా సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక న్యాయవాదులు సంతాపంగా విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు కొల్లి సత్యనారాయణ, మన్నెపల్లి బసవయ్య, మాదిరాజు లక్ష్మీనారాయణ, నేరెళ్ల శ్రీనివాస్, బిచ్చాల తిరుమల రావు, ఓరుగంటి శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఐఓ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని అజీజ్‌గల్లీలో సంఘం కార్యాలయంలో ఎస్ఐఓ తెలంగాణ విద్యార్థుల మేనిఫెస్టోను సోమవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవటంతో చాలామంది విద్యార్థులు విద్యాసంస్థల నుంచి సర్టిఫికెట్లు పొందలేక రుణాలపై ఫీజులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఫరాజ్ అహ్మద్, నగర అధ్యక్షుడు అమీర్‌ఒసామా, కార్యదర్శి మతీన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	స్కంద
వినోద	చిన్నా
సాయిరాం	యూనివర్సిటీ, రతినిర్వేదం
ఆదిత్య	మ్యాడ్
శ్రీనివాస	చంద్రముఖి 2
సుందర్	మిస్టరీ

- ఖమ్మం గాంధీచౌక్

పండగ వేళ.. పుష్ప విలాసం..

బతుకమ్మ, నవరాత్రోత్సవాలతో పూలకు గిరాకీ

- తంగేడు, గునుగు పూలకు డిమాండ్
- పెరిగిన బంతి, చామంతి, టేకు, తామరల ధర
- ఎక్కడ చూసినా పూల విక్రయాలే..


బంతి పూలు విక్రయిస్తున్న రైతు


తంగేడు, గునుగు తదితర పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలో పూల విక్రయం జోరుగా సాగుతోంది. ఓ వైపు బతుకమ్మ, మరో వైపు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూల అమ్మకం జోరందుకుంది. అమ్మకందారులతో పాటు గ్రామాల నుంచి పలువురు రైతులు నేరుగా పూలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. పండుగలను పురస్కరించుకొని ఖమ్మం, మధిర, పాలేరు, వైరా వ్యవసాయ డివిజన్లలో రైతులు పూల తోటలను సాగు చేస్తున్నారు. పూలను తీసుకొచ్చి ఖమ్మం నగరంతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. నగరంలో ఏ కూడలి చూసినా ప్రస్తుతం పూల విక్రయాలే దర్శనమిస్తున్నాయి. పెవిలియన్ గ్రౌండ్, గాంధీచౌక్, కాల్వొడ్డు, కమాన్ బజార్, కస్బాబజార్, చర్చి కాంపౌండ్, ముస్తఫానగర్, బోనకల్ రోడ్డు, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్, రోటరీ నగర్, మమత హాస్పటల్ రోడ్, బైపాస్ రోడ్, కొత్త బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో ప్రత్యేకంగా పండుగల సందర్భంగా పూల విక్రయాలు సాగుతున్నాయి.

వీటికి డిమాండ్..

పంట పొలాల్లో లభించే పూలు, సీజనల్‌గా పూసే పూలతో బతుకమ్మను పేర్చుతారు. అంతేగాక బతుకమ్మ పండుగలో తంగేడు పూలకు ప్రాధాన్యం ఎక్కువ. ఎన్ని రకాల పూలతో బతుకమ్మను పేర్చినా తంగేడు లేకుంటే బతుకమ్మ పేర్చడం పూర్తికానట్టే నని భావిస్తారు. కనీసం ఒక్క తంగేడు పూవునైనా బతుకమ్మలో పేర్చుతారు. గ్రామాల నుంచి, పంట పొలాలు, బీళ్లు, అడవుల నుంచి కొందరు ప్రత్యేకంగా తంగేడు పూలను కోసుకొచ్చి కట్టలు కట్టి విక్రయిస్తున్నారు. కట్టను బట్టి ధరను నిర్ణయించి విక్రయిస్తున్నారు. మూడు చిన్నచిన్న కట్టలను రూ. 50ల చొప్పున, కొద్దిగా పెద్ద కట్ట ఒక్కదాన్ని రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. మహిళలు తంగేడు పూలను తప్పక కొనుగోలు చేస్తున్నారు. ఇక గునుగు పూలు మూడు కట్టలు రూ. 30ల చొప్పున విక్రయిస్తున్నారు. ఇక అల్లిపూలను ఒక్కొక్కటి చొప్పున పూల సైజును బట్టి రూ. 20 నుంచి రూ. 40ల వరకు కూడా విక్రయిస్తున్నారు.

పైపైకి వెళ్తున్న ధర

బంతి, చామంతి, టేకు, తామర పూలకు కూడా డిమాండ్ బాగానే ఉంది. బంతి పూలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధరతో విక్రయిస్తున్నారు. కిలో బంతి పూలను రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు రూ.60కు కూడా విక్రయిస్తున్నారు. చామంతి పూలకు మాత్రం ధర బాగానే ఉంది. కిలో చామంతి పూల ధర రూ.200 వరకు పలుకుతుంది. టేకు పూలకు రంగులద్ది కట్టల చొప్పున, కట్ట సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో కట్టను రూ.15 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. తామర పూలకు కూడా బాగానే డిమాండ్ ఉంది. నాలుగు తామర పూలు సైజును బట్టి రూ.80 నుంచి రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు.

వివిధ ప్రాంతాలకు చెందిన వారు విక్రయాలు

బంతిపూలను వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు విక్రయిస్తుండగా.. తంగేడు, గునుగు, టేకు, అల్లిపూలు, తామర పూలు వంటి వాటిని మాత్రం మారుమూల ప్రాంతాలకు చెందిన కూలీలు, రైతులు ప్రత్యేకంగా తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇల్లెందు, టేకులపల్లి, ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి, తిరుమలాయపాలెం తదితర ప్రాంతాల ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పూల అమ్మకం ద్వారా ఖర్చులు పోను కూలీ గిడుతుందని విక్రయదారులు చెబుతున్నారు.

అందుబాటులో ఉన్నాయి..



తంగేడు, గునుగు, తామర వంటి పూలకు ధర ఉన్నా రైతులు, కూలీలు అందుబాటులోకి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పూలు అందుబాటులో ఉండటంతో కొనుగోలు చేసి బతుకమ్మ ఉత్సవాలను చేసుకుంటున్నాం. తంగేడు పూలకు బాగా డిమాండ్ ఉంది. మూడు చిన్న కట్టలు రూ. 50ల చొప్పున కొనుగోలు చేశా. బతుకమ్మను పేర్చే బుట్టలు కూడా విక్రయిస్తున్నారు.

– కడవెండి అరుణకుమారి, ద్వారకానగర్, ఖమ్మం

అటవీ ప్రాంతం నుంచి తీసుకొచ్చాం



రెండు రోజులుగా అడవులకు వెళ్లి తంగేడు, గునుగు, టేకు పూలు, చెరువుల వద్దకు వెళ్లి అల్లిపూలు, తామర పూలను తీసుకువచ్చి విక్రయిస్తున్నా. ఎప్పటికప్పుడు పూలు అమ్ముడుపోతే కనీసం కూలీ దక్కే విధంగా ఉపాధి లభిస్తుంది. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పూలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. రోజుకు రూ. 500ల నుంచి రూ.600ల వరకు లభిస్తాయి.

– కోనేటి మంగమ్మ, వెలుగుమట్ల

మా తోటలోనే సాగు..



ఎకరంలో బంతి సాగు చేస్తున్నా. బతుకమ్మ, శరన్నవ రాత్రుల సందర్భంగా పూలను తీసుకువచ్చి విక్రయిస్తున్నా. వ్యాపారులకు విక్రయించటం ద్వారా ఆశించిన ఫలితం ఉండదు. నేరుగా విక్రయిస్తే కొంత ప్రయోజనం ఉంటుంది. కిలో బంతి పూలను రూ. 80 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తున్నా. ప్రస్తుత పండుగ సీజన్‌లో పూల పంటను విక్రయించుకుంటా.

– ఆర్.వెంకటేశ్వర్లు, రైతు, పల్లిపాడు

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన రంగా లీలావతి, జలగం నాగిని సుప్రియ, కొదుమూరి శ్రీనివాసరావు, ముచ్చింతల చిన్న నర్సింహారావు, ఆనుగుల రామేశ్వరి, వేములపల్లి భిక్షమయ్య, రాచర్ల వెంకటమ్మ, మెండ కృష్ణయ్య, మైలవరపు ప్రసాదరావు మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్.వి ప్రసాద్, అగర్వాల్, వాసన్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్. అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దాస్పత్రిలో సెల్‌ఫోన్ల చోరీ


ఖమ్మం ప్రభుత్వాస్పత్రి

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో తరచూ చోరీలు జరుగుతున్నాయి. తాజాగా సోమవారం నాలుగు సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయని బాధితులు తెలిపారు. ఇన్‌పేషంట్ రోగులకు చెందిన బంధువుల ఫోన్లు చోరీ కావటంతో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి. వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల రోగి బంధువులకు చెందిన బంగారు గొలుసు, రోగులకు వినియోగించే వీల్‌చైర్లు, ఆక్సిజన్ సిలెండర్లకు పెట్టే రాగి వస్తువులు తస్కరించబడ్డాయి. ఇంత జరుగుతున్నా సెక్యూరిటీ వ్యవస్థను పటిష్ఠం చేయటంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం ఆస్పత్రిలో రక్షణ కల్పిస్తూ పర్యవేక్షించాల్సిన సెక్యూరిటీ ఏజెన్సీ పట్టించుకోకపోవటంతోనే తరచూ చోరీలు జరుగుతున్నాయని రోగులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రిలో పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపట్టి, చోరీలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు విస్మరించొద్దు..


మాట్లాడుతున్న ఆర్ఓ రాజేశ్వరీ

ఖమ్మంరూరల్: ప్రతీ రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలకు ఖచ్చితంగా పాటించాలని, పార్టీలు సమావేశాలు నిర్వహించుకోవాలనుకుంటే అనుమతి తప్పనిసరని పాలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారిణి రాజేశ్వరి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్ఓ మాట్లాడుతూ... ప్రచార వాహనాలకు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లకు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు, ర్యాలీలు, బ్యానర్లు కట్టడానికి అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బు, మద్యం పంపిణీ జరుగుతున్నట్లయితే సామాన్యులు కూడా సీవీజీ యాప్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయొచ్చని, యాప్‌ని దుర్వినియోగ పరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఫిర్యాదులు చేయాలంటే 1950కి చెప్పవచ్చని, ఏమైనా అనుమానాలుంటే 08742-252566కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 289 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి 27 సెక్టార్లుగా విభజించామని, 10 నుండి 15 పోలింగ్ స్టేషన్లకు చొప్పున సెక్టోరియల్ అధికారులు ఉంటారన్నారు. ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేసినట్లు, అక్రమంగా తరలిస్తున్న రూ.2.80లక్షలు నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బీవీ. రామకృష్ణ, నియోజకవర్గ ఎన్నికల డీటీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంనియోజకవర్గంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు క్రియాశీలకంగా పని చేయాలని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురం, 4 వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో డివిజన్ల ముఖ్య నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి తెలంగాణ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, నగరంలో నలువైపులా పువ్వాడ అజయ్ కుమార్ చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలియజేయాలన్నారు. అనంతరం 4 వ డివిజన్ యూపీహెచ్ కాలనీ నందు దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బాలబాట' బాలలకు వరం

నేలకొండపల్లి: బాలబాట గ్రామీణ బాలలకు వరం లాంటిదని కార్డ్స్ స్వచ్ఛంద సంస్థ డిప్యూటీ డైరెక్టర్ బేబి అన్నారు. మండల కేంద్రంలో కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... విద్యతో బాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యం తో సంస్థ ముందుకు సాగుతుందన్నారు. బాలబాట కార్యక్రమం ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పెరటి తోటల పెంపకంలో భాగంగా ఏడు రకాల కూరగాయల విత్తనాలు కలిగిన 1000 ప్యాకెట్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ, నేలకొండపల్లి మండలాలకు చెందిన ఏరియా కో ఆర్డినేటర్ బొడ్డు బాబురావు, డెవలప్‌మెంట్ ఆర్గనైజర్స్ సిద్ధెల గురునాథం, కుక్కల జ్యోతి, చిర్రా అంజిలి, నాగరాజు, వడ్లమూడి విజయ, తోళ్ల సాయి, ఇనుప ఉపేందర్, ఇరుగు రమాదేవి, రమేష్, లలిత, కుక్కల కుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న బేబి

సబ్బండ వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్టీ సెల్ చైర్మన్ జి.రవి అన్నారు. సోమవారం మండలంలోని జాస్తిపల్లి, లాల్యతండ గ్రామాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి గడపగడపకు 6 గ్యారంటీ స్కీమ్‌ల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవండ్ల రామకృష్ణ, భూక్యా రమేష్, కేశోత్ రాందాస్, సీతారాం, మధు, రాజ్యు, సతీష్, ధారావత్ కృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

ఖమ్మంలీగల్: కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని న్యాయవాదులు కోరారు. కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో నర్సింహారావు, తాజుద్దీన్ బాబా, దండ సుధాకర్, స్వామి రమేష్, కాటంనేని రమేష్, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గోగినేని సుధాకర్‌రావు, సుధీర్‌సింగ్, ఐతం రవీందర్, రామ సహాయం అరవింద్‌రెడ్డి, ఇరుకులపాటి వెంకటేశ్వర్లు, శేఖర్‌రాజు తతదితరులు మాట్లాడారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిని లీగల్ సెల్‌లోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


దయాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఐదో డివిజన్ రాజీవ్‌నగర్‌గుట్టపై సోమవారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఎంపీటీసీలు పల్లెబోయిన భారతి చంద్రం, దండా జ్యోతిరెడ్డి, పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని దయాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వడ్డెబోయిన నరసింహారావు, పల్లెబోయిన చంద్రయ్య, చల్లా రామకృష్ణ, చల్లా శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.2వేల విలువైన మద్యం స్వాధీనం

కామేపల్లి: మండలంలోని పాతలింగాలలో చామంతుల రమకు చెందిన కిరాణంలో సోమవారం పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.2 వేలు విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణిలో సోమవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి కర్నాటి శ్రీనివాస్, గుంతేటి ఉపేందర్, దోనేపల్లి వెంకటేశ్వర్లు, దారా మధులపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తుమ్మలను విమర్శించడం తగదు..

ఖమ్మంవన్‌టౌన్: 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ మచ్చలేని నాయకుడిగా ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావే ఖమ్మాన్ని అత్యంత అభివృద్ధి పథంలో నడిపించారని, తుమ్మలను తీవ్రపదజాలంలో విమర్శించడం తగదని కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ కమర్తపు మురళీ, నాయకులు చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, ఏలూరి శ్రీనివాసరావులు అన్నారు. సోమవారం తుమ్మల క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... లకారం ట్యాంక్‌బండ్ మొదలుకుని ఐటీహబ్, కొత్త బస్టాండ్, కొత్త కలెక్టరేట్, ధ్వంసలాపురం బ్రిడ్జీలు తుమ్మల మంత్రిగా ఉన్నప్పుడు తెచ్చినవేనన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, కుక్కల వెంకన్నలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

ఖమ్మంవన్‌టౌన్/ ఖమ్మంగాంధీచౌక్: బాల్యవివాహాల నిర్మూలన ఒక సామాజిక అవసరమని, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించాలని త్రీటౌన్ సీఐ సత్యనారాయణ అన్నారు. సోమవారం యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా అధికారులకు సమాచారం ఇచ్చి వాటిని అడ్డుకోవాలన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి, ఏఐడీ సంస్థ డైరెక్టర్ హరి ప్రసాద్, సుబ్బారావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె శ్రీనివాస్, షీ టీమ్ ఎస్సై నాగేందర్, భాస్కర్, నరసింహారావు, రాజకుమారి, మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం..

ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సతీమణి వసంతలక్ష్మిని రెయిన్‌బో గెలాక్సీ అపార్ట్‌మెంట్ మహిళలు సత్కరించారు. సోమవారం అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన వసంతలక్ష్మికి స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. తామంతా పువ్వాడ కుటుంబం వెంటే ఉంటామన్నారు.

బతుకమ్మ, నవరాత్రి సంబురాలు

బతుకమ్మ, దేవీనవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమివ్వగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలు వివిధ పూలతో తయారు చేసిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మను పూజించి నైవేద్యం సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంగాంధీచౌక్: జమ్మిబండపై శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు


ఖమ్మంమయూరిసెంటర్: గౌరమ్మకు పూజలు చేస్తున్న పువ్వాడ వసంతలక్ష్మి, మహిళలు


ఖమ్మం రూరల్: అన్నపూర్ణ అవతారంలో మారెమ్మతల్లి


ఖమ్మంఅర్బన్: బొమ్మ కాలేజీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


నేలకొండపల్లి: రాయగూడెంలో..


ఖమ్మం సహకారనగర్: డాక్టర్ మెడికల్ అకాడమీలో..


కూసుమంచి: నర్సింహులగూడెంలో..


ఖమ్మంగాంధీచౌక్: కవిరాజ్ నగర్‌లో..